కథావేదిక

# ఎంగిలి మెతుకులు

- కాకాని కమల

సుబ్బికి చెడ్డ దుఃఖంగా ఉంది.

ఒకపక్క పెరట్లో నల్ల గట్టున తట్టెడు అంట్లు, మరొక ప్రక్క మేటెడు మాసిన గుడ్డలు పడివున్నాయి. వాటిని చూస్తుంటే సుబ్బికి కడుపులో దుఃఖం రెట్టింపు అవుతూంది.

''ఏవే సుబ్బి, ఈమధ్య నీకేవన్నా మాయరోగం వచ్చిందా? ఎక్కడ పన్లు అక్కడే వదిలేస్తున్నావ్. ఇల్లంతా దుమ్ము ఎలా పేరుకుందో చూడు. రోజూ డస్ట్ తియ్యటం మానేశావ్. అంట్లు సరిగా తోమటం లేదు. బట్టలు మురికి వెళ్ళటంలేదు. మిషన్‌లో బట్టలుతకటం కూడా నీకు కష్టంగానే ఉంది. తేరగా తిని సోమరిగా పడుకోటానికి బాగా అలవాటుపడ్డావ్. పదవ తరగతికి చదవమని పుస్తకాలు తెచ్చాను. వాటిని ముట్టుకోవటం మానేశావ్. మీనాన్నరాని చెప్తాను.'' అమ్మగారు గయ్యిగయ్యిమంటు అరిచి కోపంతో సుబ్బి చెంప మీద ఛెళ్ళు ఛెళ్ళున రెండు అంటించింది. వంగదీసి వీపు మీద రెండు గుద్దులు కూడా వేసింది. గట్టిగా వార్నింగ్ ఇస్తున్నట్లు అంది–

''తిన్నగా పని చెయ్యదల్చుకుంటే వుండు. లేకపోతే ఫో. తేరగా మేపటానికి మాకేం ఎక్కువ లేదు. ఆఖరి సారి చెపుతున్నాను. నేను సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇల్లంత అద్దంలా వుంచకపోతే ఏం జరుగుతుందో చూడు.'' పధ్నాలుగేళ్ళ సుబ్బిని మళ్ళీ నెత్తిమీద ఒక మొట్టికాయ వేసి పట్టుచీర విసవిసలాడిస్తు పిల్లలిద్దర్నీ తీసుకుని కారెక్కింది అమ్మగారు.

అప్పటికే అయ్యగారు కారులో కూర్చుని హారన్ పదే పదే మోగిస్తు తొందర చేస్తున్నారు.

కారువెళ్ళిపోయాక సుబ్బి తలుపు వేసుకుని లోపలికి వచ్చి బాల్కనీలో కూర్చుంది.

ఎదురుగా మేజా మీద నాలుగు నలిగిన పట్టుచీరలు పేపర్‌లో పెట్టి వున్నాయి. ఈరోజు పొద్దున్న తిట్టింది సుబ్బిని అమ్మగారు–

''నీకు వారం రోజుల్నుంచి చిలక్కి చెప్పినట్లు చెప్తున్నాను. ఆ పట్టుచీరలు ఇస్త్రీ చేయించుకురావే అని. కాని నీ చెవికి ఎక్కటం లేదా.''

సుబ్బి అసహనంగా తల విదిల్చుకొంది. ''చచ్చినా చేయించను. నన్ను కొట్టినా చంపినాసరే. ఆ పట్టుచీరలు, నగలు సింగారించుకుని కార్లో పెళ్ళిళ్ళకి, విందులకి వెళ్ళేది ఆమె, వాటిని పట్టుకుని నడుచుకుంటు సందు చివరకి పోయి ఇస్త్రీ చేయించుకొచ్చేది తనూనా? నన్ను నరికినా సరే. చేయించను.'' మొండిగా నిర్ణయించుకుంది సుబ్బి.

పధ్నాలుగేళ్ళ సుబ్బికి మనసంతా ఉడికిపోతూంది. వెండి జరీ పట్టుచీరలు, ఒంటెడు నగలు పెట్టుకుని కారులో పెళ్ళికి పోయింది అమ్మగారు.

కూరగాయలు బజారుకో, షాపింగ్‌కో పోతే సుబ్బిని వెంటపెట్టుకు పోతుంది. సంచులు మోసి కార్లో పెట్టటానికి పిల్లల్ని ఎత్తుకోటానికి.

కాని విందులకి పోతే తీసుకుపోదు సరికదా రెట్టింపు ఇంటిపని అప్పజెప్పి, సుబ్బిని ఇంటికి కాపలా పెట్టిపోతుంది.

ఈరోజు అలాగే లప్పెడు పని అంటగట్టి, సరిగా చెయ్యటం లేదని రెండు మొట్టికాయలు వేసి మరీ వెళ్ళింది. లేచింది మొదలు తిడుతూనే ఉంది.

సుబ్బికి భోరున ఏడవాలనుంది. ఇంటిపని జోలికి పోకుండా బాల్కనీలోకి వచ్చి ఎదురింటికేసి చూస్తూ కూర్చుంది మొండిగా. ఎదురింట్లో పెళ్ళి జరుగుతుంది. చాలా వైభవంగా పెళ్ళి జరుగుతుంది. పెద్ద షామియానా, రంగురంగుల చెమ్కి దండలు, ఆర్భాటంగా లౌడ్ స్పీకర్లు పెట్టి హోరున సినిమా పాటలు వేస్తున్నారు. ఆడా మగా పిల్ల పాపా కార్లలో ఆటోల్లో వస్తున్నారు. ఎన్ని రంగుల పట్టుచీరలో... సిల్కు సిల్కు దుస్తులు. అందరూ ఎంత ఆనందంగా ఉన్నారో? సుబ్బి ఈడు పిల్లలు కూడా మంచి మంచి పట్టుపరికిణీలు, డ్రస్సులు, చెమ్కి గౌన్లు వేసుకుని ఎంత స్టైలుగా ఉన్నారో మెరిసే బొట్టు బిళ్ళలు, పౌడర్లు, లిప్‌స్టిక్కులు. జడనిండా పూలు... అచ్చం సినిమాల్లోలా...

వాళ్ళందర్ని చూస్తుంటే సుబ్బికి రోషంగా ఉంది.

అలా తను అలంకరించుకోవాలనుంది. అమ్మగారు తన్ని కూడా వాళ్ళ చుట్టాలింట్లో పెళ్ళికి తీసుకెడుతుందేమో అని ఆశపడింది. కాని ఇంట్లో వదిలేసి పోయింది. పైగా ఇంటెడు చాకిరి అప్పగించింది.

సుబ్బికి దుఃఖం తన్నుకొని వస్తుంది.

''సుబ్బి'' అసలు పేరు సుబ్బలక్ష్మి. కాని అమ్మగారు కోపంవస్తేసుబ్బి అని పిలుస్తుంది. లేకపోతే 'సుబ్బులు' అంటుంది. అమ్మగారు అయ్యగారు ఉద్యోగాలు చేస్తారు. ఇద్దరు చిన్న పిల్లలు. మూడేళ్ళ సుష్మ. ఏణ్ణర్థం సుభాష్. రోజు ఉదయం పదింటికి అమ్మగారు అయ్యగారు ఆఫీసుకెళ్ళిపోయి సాయంత్రం ఆరింటికి వస్తారు.

పిల్లల్ని కనిపెట్టుకుని పగలంతా సుబ్బి ఒక్కర్తే ఇంట్లో వుంటుంది. వాచ్‌మెన్ ఉన్నాడు. గేటు పక్కనే వున్న చిన్న అవుట్ హౌస్‌లో ఉంటాడు. పాచిపని ఇంటిపని చిన్న చిన్న బజారు పన్లు సుబ్బి చేస్తుంది. అమ్మగారు వంట చేస్తుంటే సాయం చేస్తుంది. పిల్లల్ని పట్టుకుంటుంది. ఇంటిచుట్టు వున్న తోటపని, కారు క్లీనింగ్ లాంటివి వాచ్‌మెన్ చేస్తాడు. వాచ్‌మెన్ కాస్త వయసు మళ్ళినవాడు. ఒంటరివాడు. మిలట్రీలో చేసి వచ్చాడు. ఇంటిని చూస్తాడు.

సుబ్బి తల్లితండ్రి దూరంగా పల్లెలో ఉంటారు. సుబ్బి తండ్రి కొమరయ్య అయ్యగారి పొలాలు కౌలుకి చేస్తాడు. సుబ్బికి పదేళ్ళ వయసప్పుడు అమ్మగారి దగ్గర సుబ్బిని పనికి పెట్టాడు.

నాలుగు నెల్లకోసారి వచ్చి కూతుర్ని చూసి వెడతాడు. సుబ్బికి మూడు పూటలా భోజనం, కాఫీ, టిఫిన్ అన్నీ అమ్మగారు వాళ్ళతోపాటు సమంగా పెడుతుంది. ఏడాదికో రెండు జతల కొత్త బట్టలు కుట్టిస్తుంది. అవిగాక ఆవిడ పాత చీరలతో కూడా బట్టలు కుట్టిస్తుంది. ఇవిగాక నెలకింతని జీతం కూడా వుంది. ఆ జీతం కొమరయ్య వచ్చినప్పుడల్లా తీసుకుపోతాడు. కూతురి చేతుల్లో ముచ్చటకైనా పది రూపాయలు పెట్టడు. ''నీకెందుకే డబ్బు. అన్నీ అమ్మగారు చూస్తున్నారుగా?'' అంటాడు.

ఆ ఇంటికి వచ్చిన కొత్తల్లో ఏమోగాని సుబ్బికి వయసు వచ్చి ఊహ తెలుస్తున్నకొద్ది అమ్మగారు ఒక పెద్ద రాక్షసి. ఆ ఇల్లు ఒక పెద్దజైలు.

ఎప్పుడూ పని పని పని.

మిషన్‌లాగ టైము ప్రకారం లేవాలి. పని చెయ్యాలి. పిల్లల్ని ఆడించటం, సంరక్షణ, బాసన్లు కడగటం, బట్టలుతకటం, తినటం. ఇవి చాలవన్నట్లు 'చదువుకో చదువుకో' అని అమ్మగారి సతాయింపు. అదిసరిగా చెయ్యలేదు ఇదిసరిగా చెయ్యలేదని సాధింపు.

ఇంతకు మించి బతుకులేదు. ఆనందం లేదు. సుఖం లేదు. మనసు విప్పి ఇష్టం చెప్పటానికి లేదు. ఓపిక లేకున్న పని చెయ్యాలి. లేకుంటే అమ్మగారు

పూరుకోరు. ''ఏం మాకంటె ఎక్కువ పాటు పడుతున్నావా? మేం చెయ్యటంలేదు?'' అంటుంది.

సుబ్బి మనసు ఎదురు తిరుగుతుంది.

''అయ్యా! నేనీడ వుండనే. నన్ను కూడా నీఎంట మనూరికి తీసికుపో. ఆడనే ఏదన్న పని చేసు కుంట.'' అంది ఒకసారి తండ్రి వచ్చినపుడు.

కాని తండ్రి ఒప్పుకోలేదు సరి కదా కూతురి మీదే గయ్యిన ఎగిరాడు.

''అప్పుడే అంతటి దానివయినావే. నువ్వు ఇక్కడ పనికి వుండక పోతే నీ అక్క పెండ్లి కోసం చేసిన అప్పు ఎలా తీరుద్ది? నువ్వు ఆడికి వస్తే నిన్ను పోషించే పరిస్థితి నాకాడ ఏడుంది? నీపైన ఇంకా ఇద్దరాడ పిల్లలున్నారు. వాళ్ళ పెండ్లిండ్లు ఎట్టగావాలి? నోరు మూసుకుని ఇక్కడ వుండు.'' అన్నాడు.

''ఆడకూడా నేను వూరికే కూచోను. పల్లికొచ్చినా ఏదన్న పని చేస్తా.'' అంది.

''ఏం పని చేస్తావ్. ఆడ మాకే పన్లు లేవు. ఇప్పుడు ఎగసాయం అంత మిషన్లతోనే నడుస్తోంది. అయినా ఈడ నీకేం తక్కువ? మూడు పూట్ల మంచి తిండి, బట్ట. చల్లగా బంగళాలో వుంటావు. టి.వి.లు, ఫ్యాన్లు. ఈడకొచ్చినప్పుడు ఎట్లుండేదానివి? నల్లగా ఎలక లెక్క వున్నావు. ఇప్పుడు చూడు రంగుతేలి నిగనిగలాడుతూ ఎంత ముద్దుగున్నావే. మేము అక్కడ తినేది జొన్న సంకటి. నీకెరికేనా ఆ సంగతి?'' అని కసిరాడు.



ఏడ్చి ఎంత మొత్తుకున్నా తండ్రి వినడు.

అందుకే నోరు మూసుకుంది. అమ్మగారు తనకి అన్నంలో మజ్జిగ పోస్తుంది. కాని మూడేళ్ళ సుష్మకి, సుభాష్‌కి మీగడ పెరుగువేసి వెండి గిన్నెలో కలిపి పెడుతుంది. వాళ్ళకి ఎక్కసం అయి ఒకోసారి తినరు పడేస్తారు.

అప్పుడు అమ్మగారు తన్ని ప్రేమగా పిలిచి–

''ఒసే సుబ్బి, ఆ వెండి కంచంలో మీగడన్నం ఉంది. సుష్మకి ఒద్దుట ఆ కాస్త నువ్వు తినేసి కంచం కడిగి షెల్ఫ్‌లో దాచెయ్యి'' అంటుంది.

మీగడన్నం రుచిగా ఉంటుంది. కాని సుబ్బికి ఎంగిలన్నం తినడం ఇష్టం వుండదు. అందుకే ''నాకు ఒద్దమ్మగారూ'' అంటే అమ్మగారు గయ్యిమంటుంది.

''ఏం మాయరోగమే చిన్నపిల్లలు తిన్న పెరుగన్నం తింటానికి? మీగడన్నం పారేసుకుంటే ఏమొస్తుంది?'' అంటుంది కళ్ళెర్రచేస్తు.

ఆమెని ఎదిరించ శక్తిలేక ఇష్టంలేకపోయినా ఆ ఎంగిలి అన్నం తిని వెండి కంచం తోమి గుడ్డతో తుడిచి బీరువాలో దాస్తుంది సుబ్బి.

''అంతే మరి. తన బతుకంతే. అమ్మగారు పెట్టే ఎంగిలి మెతుకులు తిని ఆవిడ కట్టి పారేసిన పాత చీరలు, చింపి పరికిణీలు కుట్టించుకుంటు, ఆవిడకి వెట్టిచాకిరి చేస్తూ... ఇంత... ఇలాగే బతకాలి.

సుబ్బి కళ్ళ నుంచి బొట బొట నీళ్ళు కారుస్తునే అంట్లగిన్నెలన్నీ తోమింది. మిషన్‌లో బట్టలేసి ఉతికి ఆరేసింది. ఇల్లంత శుభ్రం చేసింది. అమ్మగారు బల్ల మీద సర్దిపెట్టిన అన్నం కూర రాత్రి మిగిలిన చపాతీలు తిని మళ్ళీ బాల్కనీలోకి వచ్చి ఎదురింటి పెళ్ళి సంబరం చూస్తు కూర్చుంది.

ఇందాకటికంటే జనం ఎక్కువయిపొయ్యారు. పెళ్ళి జోరు హెచ్చింది. మంచి వంటకాల రుచులు ఘుమ ఘుమలాడిస్తు గాలిలో తేలితేలి వస్తున్నాయి.

పెద్ద పెద్ద జరీ అంచు పట్టుచీరలు కట్టుకుని ఆడాళ్ళు మెడలో మోయలేని నగలు సవరించుకుంటు ఒకరితో ఒకరు పకపక నవ్వుకుంటు మాట్లాడుకుంటున్నారు.

''బాగున్నారా బాగున్నారా బావగారూ బాగున్నారా?'' అంటు లౌడ్ స్పీకర్‌లో మోతగా సినిమా పాటలు వేస్తున్నారు. పక్కనవున్న చిన్న పిల్లలు ఆపాటలకి అనుగుణంగా డాన్సు చేస్తున్నారు.

''నేను జీవితంలో ఒక్కసారైనా అలాంటి మంచి బట్టలు నగలు కట్టుకుని అంత ఆనందంగా ఉండగలనా?'' అనుకుంది పెళ్ళి ఇంటికేసి తేరబారి చూస్తు సుబ్బి.

''తనది చాకిరి బతుకు. తనకి అంత అదృష్టమా?'' సుబ్బి నిరాశగా అనుకుంది.

ఎదురుగా పెళ్ళింట్లో భోజనాలకి ఏర్పాట్లు చేస్తు

## ఇబ్బంది

''సన్మానం ఎలా జరిగింది?'' ఇంటి కొచ్చిన హీరోయిన్‌ని అడిగాడు భర్త.

''అంతా బాగానే జరిగిందిగానీ నిండుగా శాలువా కప్పుతుంటే చెప్పలేనంత ఇబ్బంది కలిగింది'' చిరాగ్గా చెప్పింది హీరోయిన్.

- పెనుమాక దేవానంద్‌శ్రీ (ధర్మవరం)

## పేషెంటు

నర్స్‌ని అడిగాడు డ్యాక్టర్, ''ఆ మూడవ నెంబర్ రూమ్ పేషెంట్ పరిస్థితి ఎలా వుంది?''

''చాలా మెరుగైంది డ్యాక్టర్. మొన్నటి వరకు నాకు నీరసంగా కన్నుకొట్టేవాడు. ఇప్పుడు కౌగిలించు కుంటున్నాడు'' సిగ్గుపడుతూ చెప్పింది నర్స్.

## ఏమనుకున్నావ్?

''పెళ్ళిచూపులలో నిన్ను చూడడానికి వచ్చిన ప్పుడు నన్ను చూసి ఏం అనుకున్నావు?'' అడి గాడు శేఖర్, వంటింట్లోంచి వస్తూ.


''మీ బుర్రమీసాలు, గంభీరమైన ముఖం చూసి మీరెక్కడ నాకట్టుబాటుల్లో వుండరో అని భయప డ్డాను.'' తాపీగా చెప్పింది ఉష.

## యజమాని

''కుటుంబానికి యజమాని తండ్రి. ఇంటిపని, వంటపని చూసుకునేది తల్లి.'' ఒకటవ తరగతి పాఠం చదువుతున్నాడు వంశీ.

''ఒరేయ్... ఏమిటాపాఠం. మీ అమ్మగానీ విందంటే వీపు వాయగొడ్తుంది జాగ్రత్త.'' వంటిం ట్లోనుంచి అరిచాడు వంశీ తండ్రి.

- చందూవంశీ (ప్రొద్దుటూరు)




న్నారు. మగవాళ్ళు ఒకపక్క ఆడవాళ్ళు ఒకపక్క భోజ నాలకి కూర్చున్నారు. మొదటి బంతి పెళ్ళి భోజనాలు మొదలయ్యాయి. పది పదిహేను పంక్తుల్లో బల్లల ముందు కూర్చుని పెళ్ళివారు విందు ఆరగిస్తున్నారు.

''ఆహా ఏమి రుచి- అనరా మైమరచి'' లౌడ్ స్పీక ర్‌లో పాట జోరుగా వినిపిస్తోంది.

అయితే ఊళ్ళో పెళ్ళి అయితే కుక్కల హడావుడి ఎక్కువ అన్నట్లు పెళ్ళి ఇంటికి ఇటుపక్క గోడ అవతల చెత్తకుండి దగ్గర రెట్టింపు జనం, హడావుడిగ ఉంది.

చెత్తకుండి దగ్గర వున్న ఖాళీ ఆవరణలో చాలామంది బిచ్చగాళ్ళ పిల్లలు పెద్దలు వృద్ధులు ఒకర్ని ఒకరు తోసుకుంటు చెత్తకుండి చుట్టు చేరుతున్నారు. ఒకటే కేకలు అరుపులు. వాళ్ళందరి చేతుల్లోనూ పెద్ద పెద్ద సత్తుగిన్నెలు, డబ్బాలు ప్లాస్టిక్ సంచులు ఉన్నాయి. ఆ బిచ్చగాళ్ళందరూ మరికి ఓడుతూ నల్లగా మసి పూసి నట్లున్న శరీరాలు. అంతకంటే నల్లగా మాసికలు పట్టిన నల్లని దుస్తులు. కొందరి పిల్లలకి అయితే అసలు ఒంటి మీద బట్టలు లేవు. గోచీలు పెట్టుకున్నారు. ఆ చెత్తకుండి చుట్టు జనంతోపాటు కుక్కలు కూడా సమంగా గుంపు గూడుతున్నాయి. మనుషుల కంటె ఎక్కువగా అరుస్తున్నాయి.

ముసలి బిచ్చగాళ్ళని ఆ చెత్తకుండికి కాస్త దూరంగా కూర్చోపెట్టి వాళ్ళ చేతుల్లో కర్రలు, కంకర్రాళ్ళు లాంటివి పెట్టి ''కుక్కల్ని కాండి తనకి రాకుండా అది లించండ్రి. నీకు మేం ఏవన్న పట్టుకొచ్చి పెడతంలే.'' అంటున్నారు వాళ్ళ తాలూకు తక్కిన బిచ్చగాళ్ళు.

ఆ ముసలాళ్ళు కూర్చున్న చోటునుంచి కదలకుండ కర్రలతో అదిలిస్తు రాళ్ళు విసురుతూ కుక్కల్ని తరు ముతున్నారు.

'వీళ్ళంతా ఇప్పుడేం జేస్తరు? బిచ్చగాళ్ళకిగాని పెళ్ళోరు అన్నదానం చేస్తున్నారా?' అనుకుంది సుబ్బులు చిత్రంగా వాళ్ళకేసి చూస్తు.

ఇంతలో మొదటి పంక్తి పెళ్ళివారి భోజనాలు పూర్తి అయ్యాయి. పనివాళ్ళు ఆకులు ఎత్తి కట్టలుగా పట్టు కుని గోడమీంచి చెత్తకుండిలోకి విసిరారు. ఐదారు ఎంగిలాకుల కట్టలు వరుసగా రపరప చెత్తకుండిలో పడ్డాయి.

అవి పడటం ఆలస్యం-

కుక్కలుకంటే ఘోరంగా ఆ బిచ్చగా ళ్ళందరు ఒక్క పెట్టున దూకినట్లు ఆ చెత్త కుండి మీద పడ్డారు.

''కుక్కలు చింపిన విస్తరి'' అన్నట్లు మను షులు చింపిన విస్తళ్ళు పోగా మిగిలిన విస్తళ్ళ కట్టలని ఎవరి కండ బలం కొద్ది వాళ్ళు దక్కించుకుని ఆ చెత్త కుండి నుంచి దూరంగా వచ్చేసి కింద కూలబడ్డారు. వెర్రి ఆనందంతో ఏదో పెద్ద నిధి దొరికినట్లు వెర్రి కేకలు పెడుతూ ఆ విస్తళ్ళలో పెళ్ళివారు తిని పారేసిన కూరలు, లడ్లు, బూరెలు, పాయసం, పప్పు, అన్నం, బజ్జీలు... అన్ని వేటికవి వేరుచేసి తమవెంట తెచ్చు కున్న సత్తుగిన్నెలు, రేకు డబ్బాలు, ప్లాస్టిక్ సంచుల్లో వేసుకుంటున్నారు. మధ్య మధ్య ఆగలేనట్లు వేళ్ళు నాకుతూ రుచులు చూస్తున్నారు.

ఎక్కువ ఆకులు దొరికినవాళ్ళు వెర్రి ఆనందంతో వుంటే, తక్కువ ఆకులు దొరికినవాళ్ళు దిగాలుగా ఎంగిలి ఆకుల్లో దొరికిన తిండిని భద్రం చేసుకుంటు న్నారు.

చెత్తకుండి పక్కనవున్నవారికి కాల్వ చెడ్డవాసన వేస్తుంది. ఆ మురికి కాల్వలో అక్కడక్కడ పందులు పడుకున్నాయి. అవి కదిలినప్పుడు దోమలు జుయ్యి మని గాల్లో ఎగురుతున్నాయి. నీళ్ళు కదిలి మురికి వాసన ముక్కులు బద్దలుకొడుతూంది.

మరొకప్రక్క కుక్కలు ఆ ఎంగిలి విస్తళ్ళు ఏరుతున్న వాళ్ళ మీదకి ఎగిరి పడుతున్నాయి. భౌభౌమని తెగ అరుస్తున్నాయి.

దూరంగా కర్రలు రాళ్ళు పట్టుకుని కుర్చున్న ముస లాళ్ళు వాటిని ఛీ ఛీ అంటు అదిలిస్తు కొడుతున్నారు. అవతల గోడపక్క పెళ్ళిపందిరిలో రెండవబంతి భోజ నాలు మొదలయ్యాయి.

ఈసారి అంతా ఆడాళ్ళు కూర్చున్నారు భోజనాలకు. ఇటు గోడపక్క బిచ్చగాళ్ళు ఎంగిలాకుల ముందు మొదటి బంతి కూర్చున్నారు. ఆ ఎంగిలాకుల కోసం ఆ చెత్తకుండి మీదపడి ఒకళ్ళనొకళ్ళు తోసుకుని కుమ్ముకుని కిందపడి లేచి దుమ్ము కొట్టుకొని చివరికి ఎలాగో ఆ ఎంగిలాకులు సంపాదించుకుని వాటిలో మిగిలినవి ఆబగా తింటున్నారు.

పెళ్ళిపెద్దలు తిని పారేసిన వాటిని సగం మట్టి కొట్టు కుపోయిన వాటిని నాకి నాకి తింటున్నారు. భక్తుడు పూజారి పెట్టిన ప్రసాదం తింటున్నంత భక్తిగా తింటు న్నారు.

మళ్ళీ పెళ్ళిపందిట్లో రెండవ పంక్తి భోజనాలు పూర్తి అయి ఎంగిలాకుల కట్టలు చెత్తకుండిలో పడేదాకా ఆ బిచ్చగాళ్ళు ఎంగిలాకులు నాకుతూనే ఉన్నారు. పైగా-

''నాకు బూరి దొరికిందొరే... నాకు జిలేబి దొరికింది. నా ఆకులో అన్నం ఎక్కువుంది. పప్పు తిని ఎన్నాళ్ళ యిందో...

నాకు బజ్జీలు మస్తు దొరికినయ్యి. నాకు అప్పడాలు కూడా ఉన్నాయి...

ఒకరికొకరు రుచులు చెప్పుకుంటు అరచుకుంటు న్నారు. ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దూరంగా బాల్కనీలో కూర్చుని ఆ దృశ్యాన్ని చూస్తు వాళ్ళ మాటలు వింటున్న సుబ్బి మనసు కలవరప డింది. గుండె కెలికినట్లయింది.

ఉదయం నుంచి కడుపులో రగిలిన దుఃఖం బదులు ఏదో వేదన.

అంతవరకు అమ్మగారి మీద పొంగుతున్న కసి కోపం ద్వేషం మెల్లగా కరగసాగినయ్యి.

తన ఒంటిమీది దుస్తులకేసి చూసుకుంది. మరీ బనారసి సిల్కులు కాకపోయినా మంచి బట్టలే. కాస్త మాసినా అమ్మగారు తిడుతుంది. శుభ్రంగా మిషన్‌లో వేసి ఉతుక్కో అంటుంది.

ఒక్కరోజు తలకి నూనె రాసి దువ్వుకోకపోయినా తిడుతుంది. వారానికి ఒకసారి అమ్మగారు రుద్దుకొనే షాంపూతోనే తల రుద్దుకోమంటుంది. అందుకే తన జుట్టు నల్లగా మెరిసిపోతూ బారుగా పెరుగుతుంది. కాని ఆ బిచ్చగాళ్ళ జుట్టు, వాళ్ళంతా తన ఈడు అడపిల్లలే. కాని చిరిగిన నల్లని మసిగుడ్డలు, అట్టలు కట్టిన జుట్టు. మకిలి పట్టిన ఒళ్ళు.

సుబ్బి చప్పున తన ఒంటికేసి చూసుకుంది.

''నీకు అమ్మగారింట మంచి శాకాలలో వరన్నం మజ్జిగ టిఫిన్లు. అందాక వయసు వస్తున్నకొద్ది పెద్దింటోళ్ల పిల్ల లెక్క తేలుతున్నవ్. ఆ పల్లెలో వుంటే ఏం వుందే? మట్టి పిసుకుడు, జొన్న కూడేగా. అద్దంలో చూసుకో. నీ అక్కల కంటే ఎంత ముద్దుగున్నావే నువ్వు.'' తల్లి మాటలు జ్ఞాపకం వచ్చాయి సుబ్బికి.

అమ్మగారి పిల్లలు పళ్ళులా శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటారు. వెండికంచంలో తిని ఒదిలేసిన మీగడ పెరుగన్నం తన్ని తినియ్యమంటుంది అమ్మగారు. ''చిన్న పిల్లలకి ఎంగిలేమిటి. పారేస్తే ఏం వస్తుంది?'' అని తిడుతుంది తన్ను గునిస్తే.

కాని ఇప్పుడు ఎదురుగా ఆ చెత్తకుండి మీదపడి కుమ్ముకుంటు ఆ ఎంగిలాకుల్లో మెతుకులు ఏరుకుని తింటున్న ఆ బిచ్చగాళ్ళని చూస్తుంటే సుబ్బి మనసంత ఏదో కలవరం.

ఉప్పెనలా పెద్ద దుఃఖ కెరటం పొంగి ఆగిపోతూంది. రోజూ ఆఫీసుకి వెడుతూ అమ్మగారు ''ఒసే సుబ్బి! పిల్లల్ని జాగ్రత్తగా చూడు. కడుపునిండా వాళ్ళకి పెట్టి నువ్వు తిను.'' అంటుంది. పిల్లలకని అమ్మగారు ఇచ్చిన బిస్కట్లు తను తింటుంది. అమ్మగారు కనిపెట్టి కూడా ఏమనదు.

సుబ్బికి కళ్ళనిండా నీళ్ళు వచ్చాయి.

ఇందాకటి దాకా రాక్షసిలా కనిపించిన అమ్మగారు ఇప్పుడు అమ్మవారిలా కాశీ అన్నపూర్ణలా కనిపిస్తుంది. తను గ్రామంలో వుంటే తల్లి కూడా అమ్మగారిలా పెట్టదు. ఎప్పుడూ నూకలు లేవు అని సణుగుతుంది. ''మిమ్మల్ని నేను పోషించలేను. సావండ్రి ఎటన్న'' అని తిడుతుంది.

కాని అమ్మగారు–

ఆమే తిడుతుంది. తినకపోతే పారేస్తే తిడుతుంది. పని చెయ్యకపోతే తిడుతుంది. చదువుకోకపోతే తిడుతుంది. బట్టలు తల మురికిగా వుంటే తిడుతుంది. పిల్లలు ఒదిలేసింది ఎంగిలి కూడని తను అనుకుంది. తనది ఎంగిలి బతుకు అనుకుంది. కాని ఎదురుగా ఆ చెత్తకుండి దగ్గర కూర్చుని ఆ బిచ్చగాళ్ళు తినే ఎంగిలి కూడు కంటే తను తినే ఎంగిలి కూడు? తనకి ఈ ఇంట్లో స్వేచ్ఛ లేదు పంజరం బతుకు జైలు బతుకు అనుకుంది.

కాని ఆవెదర చెత్తకుండి దగ్గర వాళ్ళకి కావల్సినంత స్వేచ్ఛవుంది. కాని ఎందుకొచ్చిన స్వేచ్ఛ అది?

అమ్మగారు కట్టిపడేసిన పాతకోకలు తనకి కుట్టిస్తుంది అనుకుంది. కాని ఆ బిచ్చగాళ్ళ ఒంటిపైవున్న బట్టలకంటె నిత్యం తను ఇల్లు తుడిచే గుడ్డనయం కదూ?

పై మాటల్ని సుబ్బి అచ్చం అలాగే అనుకోలేదు. కాని అలాంటి భావాలే కలగా పులగంగా ఆమె లేత హృదయంలో కదిలాయి.

''పల్లెకొచ్చి ఏం చేద్దాం అనీ. అక్కడ మాకే తిండి లేదు. మాకే చేద్దాం అన్న పన్లులేవు. చిన్నప్పట్నుంచి నువ్వు అమ్మగారి దగ్గరుండబట్టి వరన్నం అలవాటైంది. మేం తినే జొన్నకూడు నీకు అరుగుతుందా? నోరు మూసుకుని అక్కడే వుండు. అమ్మగారు చెప్పినట్లు విను.'' తల్లిదండ్రులు తిట్టడం జ్ఞాపకం వచ్చింది సుబ్బికి.

తిట్టినా కొట్టినా అమ్మగారు తన్ని ప్రేమగానే చూసింది. తల్లి తండ్రి తన మీద ప్రేమతోనే హితవు చెప్పారు. తనే వాళ్ళని సరిగా అర్థం చేసుకోలేదేమో. చెప్పినమాట వినకుండా ఈమధ్య అమ్మగార్ని బాగా సతాయిస్తుంది. అయినా అమ్మగారు తన్ని వెళ్ళగొట్టలేదు.

సుబ్బి తల ఎత్తి చెత్తకుండి కేసి చూసింది.

రెండవ బంతి ఎంగిలాకులు కోసం వాళ్ళు మళ్ళీ చెత్తకుండి చుట్టు మూగుతున్నారు.

''ఛీ... ఎంగిలాకులు ఎలా తింటారూ?'' సుబ్బి చిరాగ్గా లేచి లోపలికి వచ్చింది. బల్లమీద అమ్మగారు పేపర్లో పెట్టిన పట్టుచీరలు తీసుకుని తలుపు తాళాలు వేసి ''అమ్మగారు చీరలు ఇస్త్రీ చేయించి తీసుకురమ్మన్నారు. వెడుతున్నా'' అని వాచ్‌మేన్‌కి చెప్పి, లేక లేక బిడ్డనిగన్న తల్లిలా చాలా ఆపేక్షగా ఆ చీరలు రెండుచేతుల్లో పట్టుకుని చాకలి ఇస్త్రీకొట్టుకి బయలుదేరింది.

నల్లని కారు మబ్బులు కమ్మి వాన కురిసిన ఆకాశం తెల్గిగ్గా నిర్మలంగా వున్నట్లు ఇప్పుడు సుబ్బి మనసు ప్రశాంతంగా స్వచ్ఛంగా వుంది. ఆ చెత్తకుండి దగ్గర ఎంగిలాకులు ఏరుకుని తినే బతుకు తప్పిపోయినందుకు అమ్మగారి మీద ఆపేక్ష పొంగి పొరలుతూంది. అమ్మగారితో తనని పోల్చుకుంటే బాధేసింది. కాని ఆ బిచ్చగాళ్ళతో తనని పోల్చుకుంటే గర్వంగా ఉంది. హోదా వచ్చినట్లు గర్వంగా చాకలికొట్టువైపు నడవసాగింది సుబ్బి. ★

## పొడవైన ఉత్తరం

మాజీ అమెరికన్ అధ్యక్షుడు జార్జి బుష్‌కు 1992వ సంవత్సరంలో పాటియాలా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతున్న ఒక విద్యార్థిని ఒక పొడవైన ఉత్తరాన్ని వ్రాసి దాన్ని పోస్టుచేయటం లక్షల రూపాయలు వెచ్చించవలసి ఉంటుందని పోస్టు చేయకుండానే ఉండిపోయింది. ఈ ఉత్తరం పొడుగు 3.62 కిలోమీటర్లు. 17,73,286 మాటలతో కూడిన ఈ ఉత్తరం వ్రాయటానికి ఈమెకు రెండు లీటర్ల వరకు సిరా ఖర్చయింది. ఇంతపొడవైన ఉత్తరం వ్రాయటానికి ఆమె ఎంత సమయం వెచ్చించి ఉంటుందో ఆలోచించండి మరి.

## టీ మహిమ

మహారాష్ట్రలోని పూనే సమీపంలోని ఒక గ్రామానికి చెందిన చతురాభాయి అన్న ఒక వృద్ధురాలు ప్రతి రోజూ నాలుగులీటర్ల వరకూ టీ త్రాగుతూ 32 సంవత్సరాలకు పైగా జీవిస్తు ఉంది. కేవలం టీ తప్ప మరొక ఆహారం ముట్టుకోని ఈమె పూర్తి వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ కూడా ఎంతో హుషారుగా ఉంటూ ఏ అస్వస్థతకు గురికాకుండా ఉండగలుగుతుందంటే టీ శక్తి ఎటువంటిదోగదా!

## మొట్టమొదటి పుస్తకం

మొట్టమొదటిసారిగా భారతదేశంలో అమ్మకానికి పెట్టిన పుస్తకం 'ఏ గ్రామర్ ఇన్ బెంగాలీ లాంగ్వేజ్'. ఇది 1778లో ప్రచురించబడింది. ఇంగ్లీషువారికి బెంగాలీ భాష నేర్పే టీచర్ 'నతేనియల్ బ్రాసీహాల్‌హెడ్' ఆ పుస్తకం వ్రాశారు. ప్రస్తుతం ఆ పుస్తకం తాలూకు రెండు ప్రతులే భారతదేశంలో ఉన్నాయి. వాటిలో ఒకటి కొత్త ఢిల్లీలోని జవహర్‌పూర్ హౌస్ లోని దేశ భాషా గ్రంథాలయంలో ఉంది.

- శ్రీకొండ

